క్లుప్తంగా

పోలీసుల కవాతు



గ్రామంలో కవాతు నిర్వహిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, పోలీసులు

దేవనకొండ: మండలంలోని వెలమకూరు గ్రామంలో బుధవారం పత్తికొండ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, దేవనకొండ సీఐ శ్రీనివాసులు సిబ్బందితో కలిసి కవాతు నిర్వహించారు. బెల్టుషాపులను నిర్వహిస్తూ గతంలో పట్టుబడిన నేరస్తుల ఇళ్లను తనిఖీ చేశారు. ఎన్నికల నేపథ్యంలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారు ఎంతటివారైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదని డీఎస్పీ హెచ్చరించారు.

ఓటర్లందరికీ స్లిప్పులు చేర్చాలి

తుగ్గలి: మండలంలోని ఓటర్లందరికీ ఓటరు స్లిప్పులు పంపిణీ చేయాలని తహసీల్దార్ షరిమ్మల సూచించారు. సోమవారం ఆమె మాట్లాడుతూ ఈనెల 5వరకు బీఎల్‌వోలు ఇంటింటికీ తిరిగి ఓటర్లకు ఓటరు స్లిప్పులు అందజేస్తారన్నారు. స్లిప్పులు అందజేసి సంతకాలు తీసుకోవాలని బీఎల్‌ఓలను ఆదేశించినట్లు చెప్పారు.

స్లిప్పుల పంపిణీ

వెల్దుర్తి(కృష్ణగిరి): బూత్ లెవల్ ఆఫీసర్ల (బీఎల్‌ఓ) ద్వారా ఓటరు స్లిప్పులను ఓటర్లకు అందజేసే ప్రక్రియ బుధవారం ప్రారంభమైంది. మండలంలో 58 బూత్‌ల పరిధిలోని 5,0956 మంది ఓటర్లకు సంబంధించిన ఓటరు స్లిప్పులు స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి చేరుకోగా అక్కడి నుంచి బీఎల్‌ఓలు తీసుకెళ్లి తమ పరిధిలోని ఓటర్లకు పంచడం ప్రారంభించారు. వీఆర్‌ఏల సహకారంతో బీఎల్‌ఓలు ఇంటింటికి వెళ్లి స్లిప్పులను ఓటర్లకు అందజేస్తున్నారు. ఓటరు స్లిప్పు అందని వారు సచివాలయం, పంచాయతీ కార్యాలయం, తన కార్యాలయాలంలో సంప్రదించవచ్చని తహసీల్దార్ అనంతాచారి తెలిపారు.

రాతన ఇన్‌చార్జ్ సర్పంచ్‌గా అన్వర్‌బాషా

తుగ్గలి: రాతన ఇన్‌చార్జ్ సర్పంచ్‌గా ఉప సర్పంచ్ అన్వర్‌బాషా బుధవారం బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుత సర్పంచ్ గూడూరు రాచప్ప అనారోగ్య కారణాలతో ఆరు నెలలు సెలవు పెట్టారు. దీంతో ఉప సర్పంచ్ అన్వర్ బాషాకు ఇన్‌చార్జ్ సర్పంచ్‌గా బాధ్యతలు అప్పగిస్తూ జిల్లా పంచాయతీ అధికారులు ఉత్తర్వులు జారీ చేయడంతో అన్వర్‌బాషా బాధ్యతలు చేపట్టారని పంచాయతీ కార్యదర్శి శివకుమార్ తెలిపారు.

ఘనంగా మే డే



వెల్దుర్తిలో ఏఐటీయూసీ జెండాను ఆవిష్కరిస్తున్న లలిత, హరిప్రసాద్

కృష్ణగిరి, వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తి, కృష్ణగిరి మండలాల్లో మే డేను కార్మిక సంఘాలు ఘనంగా నిర్వహించాయి. వెల్దుర్తి పట్టణంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో అనుబంధ సంఘాలు నిర్వహించిన కార్యక్రమంలో ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లలిత, ఏఐటీయూసీ సీనియర్ నాయకుడు హరిప్రసాద్, ఏసయ్య, చాందిని జెండాను ఆవిష్కరించారు. మోటార్ వర్కర్స్ యూనియన్ కార్యాలయంలో మే డే నిర్వహించారు. సీఐటీయూ కార్యాలయంలో మోటార్‌వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జరిగిన మే డే కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొమ్మన రవిరెడ్డి జెండాను ఆవిష్కరించారు. కృష్ణగిరి మండల పరిధిలోని అమకతాడు టోల్‌ప్లాజా వద్ద సీఐటీయూ జిల్లా కార్యదర్శి, టోల్ ప్లాజా వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు టి.శివరాం జెండాను ఎగుర వేశారు. ఆయా కార్యక్రమాల్లో ఏఐటీయూసీ, సీఐటీయూ, అనుబంధ సంఘాల నాయకులు మాధవస్వామి, వెంకటేశ్, రాజశేఖర్, రాముడు, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్రిక్తత రేపుతూ టీడీపీ ప్రచారం

వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తి మండల పరిధిలోని చెరుకులపాడు మజారా గ్రామమైన కొసనాపల్లెలో బుధవారం టీడీపీ ప్రచారం ఉద్రిక్తత రేపుతూ, నిబంధనల ఉల్లంఘనతో కొనసాగింది. నిర్ణీత షెడ్యూల్ మేరకు టీడీపీ అభ్యర్థి కేఈ శ్యాంబాబు, ఎంపీ అభ్యర్థి నాగరాజు కొసనాపల్లెలో సాయంత్రం ప్రచారం చేసేందుకు దాదాపు 80కు మించి వాహనాలు(కార్లు, జీపులు, ఆటోలు, బైక్‌లు) భారీ కాన్వాయ్‌తో ఈలలు, కేకలతో బయలుదేరారు. ముందుగానే వెల్దుర్తి పట్టణంలో ఎమ్మెల్యే అభ్యర్థి తండ్రి, మాజీ మంత్రి కేఈ కృష్ణమూర్తి తిష్టవేయడం, రెచ్చిపోయిన మండల నాయకులు సైతం కొసనాపల్లె ప్రచారానికి వెళ్లేందుకు భారీగా గుమికూడడంతోనే ఉద్రిక్తత మొదలయింది. ముందే ఊహించిన పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. పత్తికొండ డీఎస్పీతో సహా ఫ్యాక్షన్ జోన్, వెల్దుర్తి, దేవనకొండ, కర్నూలు, పత్తికొండ రూరల్ సీఐలు, వెల్దుర్తి, కృష్ణగిరి, ఓర్వకల్లు, జొన్నగిరి, కర్నూలు త్రీటౌన్, ఉలిందకొండ ఎస్‌ఐలు, స్పెషల్‌బ్రాంచ్ ఎస్‌ఐ, పోలీసులు మొత్తంగా 70 మందికి మించి ప్రత్యేక బలగాలు చెరుకులపాడు వైపు రాకపోకలను నియంత్రిస్తూ ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టారు. కొసనాపల్లెలో టీడీపీ నాయకుల ప్రచారానికి గ్రామస్తులెవరూ స్పందించకపోవడం, కాన్వాయ్‌తో వెళ్లినవారే మొత్తంగా ఉండడంతో నాయకులు స్వల్ప వ్యవధిలోనే తిరుగు ప్రయాణయ్యారు.

సంక్షేమం, అభివృద్ధి జగన్ ఎజెండా

- కూటమి మేనిఫెస్టోకి విశ్వసనీయత లేదు
- వైఎస్సార్‌సీపీ కర్నూలు ఎంపీ అభ్యర్థి బీవై రామయ్య, ఆలూరు అసెంబ్లీ అభ్యర్థి విరూపాక్షి



మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి బీవై రామయ్య



పార్టీలో చేరిన వారితో విరూపాక్షి

ఆలూరు రూరల్: సంక్షేమం, అభివృద్ధే ఎజెండాగా పాలన సాగిస్తున్న జగనన్నను మరోసారి ఆశీర్వదించి గెలిపించాలని వైఎస్సార్‌సీపీ కర్నూలు ఎంపీ అభ్యర్థి బీవై రామయ్య, ఆలూరు అసెంబ్లీ అభ్యర్థి విరూపాక్షి కోరారు. బుధవారం మండల పరిధిలోని పెద్ద హోతూరు గ్రామంలో ఆలూరు సహకారం సంఘం మాజీ చైర్‌పర్సన్ సౌమ్య రెడ్డి ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచార బహిరంగ సభ ఏర్పాటు చేశారు. కర్నూలు పార్లమెంట్ ఎన్నికల పరిశీలకుడు గోరంట్ల మాధవ్, ఆలూరు అసెంబ్లీ ఎన్నికల పరిశీలకుడు తెర్నెకల్లు సురేంద్రరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ మసాల పద్మజ, కోట్ల హరిచక్రపాణి రెడ్డి, ఎంపీపీ రంగమ్మ, సీనియర్ నాయకులు మల్లికార్జున రెడ్డి, మధుసూదన్ రెడ్డి, మహిళా నాయకురాలు శశికళాకృష్ణమోహన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా బీవై రామయ్య, విరూపాక్షి మాట్లాడుతూ.. పేదల మేలు, రాష్ట్ర అభివృద్ధి కోసం సాధ్యమైన హామీలను మేనిఫెస్టోలో పొందుపరిచిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి, అధికారంలోకి రావడం కోసం అమలుకు సాధ్యం కాని హామీలతో బూటకపు మేనిఫెస్టో ప్రకటించిన చంద్రబాబుకు మధ్య ఉన్న తేడాను గుర్తించాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మాట ఇస్తే కచ్చితంగా నెరవేరుస్తారన్నారు. ముఖ్యమంత్రి విడుదల చేసిన మేనిఫెస్టోపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. 2014లో చంద్రబాబు 600కు పైగా హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేశారన్నారు. మరోసారి కూటమితో కలిసి ప్రజల ముందుకు వస్తూ లేనిపోని హామీలు ఇస్తున్నారని, నమ్మి పోసపోవద్దని ప్రజలకు సూచించారు. తమను గెలిపిస్తే ఆలూరు నియోజకవర్గంలో తాగు, సాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. సమావేశంలో మండల కన్వీనర్ చిన్న ఈరన్న, పెద్ద హోతూరు ఎంపీటీసీ దేవరాజు, కో–కన్వీనర్ వీరేష్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు నాగరాజు, నాయకులు వీరభద్ర రెడ్డి, శ్రీధర్ రెడ్డి, అనిల్ రెడ్డి పాల్గొన్నారు.

మొలగవల్లిలో..

కర్నూలు పార్లమెంట్ ఎన్నికల పరిశీలకుడు గోరంట్ల మాధవ్, ఆలూరు అసెంబ్లీ ఎన్నికల పరిశీలకుడు తెర్నెకల్లు సురేందర్ రెడ్డి, నాయకులు కోట్ల హరిచక్రపాణి రెడ్డి, శశికళతో కలిసి విరూపాక్షి మొలగవల్లి గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేసిన అభివృద్ధిని వివరిస్తూ ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని కోరారు. మండల కన్వీనర్ ఈరన్న, వైస్ ఎంపీపీ శ్రీరాములు, నాయకులు రామాంజనేయులు, తిక్కన్న, లక్ష్మిరెడ్డి, నెట్టప్ప తదితరులు ఉన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక

మండలంలోని పెద్దహోతూరు, మనేకుర్తి, అంగసకల్లు గ్రామాలకు చెందిన 60 కుటుంబాలు, హాలహర్వి మండలం విరూపాపురం గ్రామానికి చెందిన 30 కుటుంబాలు, దేవనకొండ మండలం పి.కోటకొండ గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ నాగేష్‌తో పాటు 15 కుటుంబాలు టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి చేరాయి. వీరికి వైఎస్సార్‌సీపీ ఆలూరు అసెంబ్లీ అభ్యర్థి విరూపాక్షి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలి

ఆస్పరి: వైఎస్సార్‌సీపీ కర్నూలు పార్లమెంట్ అభ్యర్థి బీవై రామయ్య, ఆలూరు అసెంబ్లీ అభ్యర్థి బుసినె విరూపాక్షికి ఓటేయాలని కోరుతూ జెడ్పీటీసీ సభ్యుడు దొరబాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు పెద్దయ్య, సుంకుర రామాంజనేయులు, మూలింటి రాఘవేంద్ర, కట్టెల గోవర్ధన, బసవరాజు, ప్రకాష్, దుమ్మా నరసింహులు, పాండు ఓటర్లను కోరారు. బుధవారం వారు మండలంలోని బనవనూరు, కారుమంచి, పలుకూరబండ, ములుగుందం, కైరుప్పల గ్రామాల్లో ఇంటింటా ప్రచారం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పెద్దరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు రాజన్నగౌడ్, కౌలుట్లయ్య, మనోహర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, చిన్నాయప్ప, వీరభద్రి, బాలయ్య శెట్టి, హసన్, శివ,లక్ష్మన్న, విజయ్‌కుమార్, హనుమంతు పాల్గొన్నారు.



నంచర్లలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న మండల వైఎస్సార్ సిపి నాయకులు

- **చిప్పగిరి:** మండలంలోని నంచర్ల గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి ఫ్యాన్ గుర్తుకు ఓటేసి విరూపాక్షిని గెలిపించాలని కోరారు. మేనిఫెస్టో ప్రతులను పంపిణీ చేశారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు రామాంజనమ్మ, సత్తిరెడ్డి, ప్రేమ్‌కుమార్, సురేష్ రెడ్డి, భీమ, నరసింహులు, దేవేంద్ర, రంగనాయకులు, యల్లప్ప తదితరులు పాల్గొన్నారు.



హెబ్బటంలో ప్రచారం నిర్వహిస్తున్న దృశ్యం

- **హొళగుంద:** మండలంలోని ముద్దటమాగి, హెబ్బటం గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు బుసినే శ్రీరాములు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి రెండు ఓట్లు ఫ్యాను గుర్తుకు వేసి ఎంపీగా బీవై రామయ్యను, ఎమ్మెల్యేగా విరూపాక్షిని గెలిపించాలని కోరారు. ప్రచారంలో నాయకులు శ్రీనివాసరెడ్డి, గాదిలింగ, వెంకటేష్, భాస్కర్ రెడ్డి, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.
- **హాలహర్వి:** మండలంలోని బిలేహాల్, బాపురం గ్రామాల్లో వైఎస్సార్‌పీ మండల కన్వీనర్ రామిరెడ్డి ప్రచారం నిర్వహించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విడుదల చేసిన మేనిఫెస్టోను వివరిస్తూ కుల, మత, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందాలంటే ఫ్యాన్ గుర్తుకు ఓటేసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నగేష్, ఎంపీటీసీ గోపాల్, సర్పంచ్ ఉలిగప్ప, నాయకులు పరశురామ్, సుంకన్న, బాపురంకృష్ణ, లింగప్ప, శేఖన్న, హులెప్ప, అయ్యాళప్ప, సర్పంచ్ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

విస్తృత ప్రచారం



కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న కోట్ల హరిచక్రపాణిరెడ్డి, బి.వెంకటేష్

దేవనకొండ: మండలంలోని కొత్తపేట, కరిడికొండ, అలారుదిన్నె, పొట్లపాడు, వరిముక్కల గ్రామాల్లో బుధవారం వైఎస్సార్‌సీపీ నాయకులు కోట్ల హరిచక్రపాణిరెడ్డి, బుసినే వెంకటేష్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి మేనిఫెస్టోను ప్రజలకు తెలియజేసి ఫ్యాన్ గుర్తుకు ఓటేసి ఎంపీగా బీవై రామయ్యను, ఎమ్మెల్యేగా విరూపాక్షిని గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా కొత్తపేటలో టీడీపీకి చెందిన ముజఫర్, రహమాన్, విరూపాక్షి, మహేంద్ర, వడ్డే మద్దిలేటి, చిన్న మద్దిలేటి తదితరులు వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి కోట్ల హరిచక్రపాణిరెడ్డి, బుసినే వెంకటేష్ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. జగనన్న పాలన నచ్చి పార్టీలో చేరుతున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు రామకృష్ణ, కొత్తపేట సర్పంచ్ బాబు, నాయకులు కప్పట్రాళ్ల దివాకర్‌నాయుడు, ప్రభాకర్‌రెడ్డి, లుమాంబ, నారాయణరెడ్డి, నిజాల్ రెడ్డి, మోహన్‌రెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల కమిషన్‌కు లోబడి విధులు నిర్వహించాలి

- 13న ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభం కావాలి
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ గుమ్మళ్ల సృజన



ఎన్నికల నియమావళిపై అవగాహన కల్పిస్తున్న కలెక్టర్ సృజన

ఆలూరు: ఎన్నికల కమిషన్ నిబంధనలకు లోబడి విధులు నిర్వర్తించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ గుమ్మళ్ల సృజన అధికారులను ఆదేశించారు. స్థానిక మోడల్ స్కూల్ ఆవరణంలో ఆర్‌ఓ, ఏఆర్‌ఓ, పీఓ, ఏపీఓలు ఈవీఎంలు (ఎలెక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు) కంట్రోల్ యూనిట్లు, బ్యాలెట్ యూనిట్లు సిబ్బందికి ఇస్తున్న మాస్టర్ ట్రైనింగ్ డెమోను బుధవారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈవీఎంలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. 12 వ తేదీ రాత్రికే పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంలను చేర్చాలని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి రామునాయక్‌కు సూచించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద అదనంగా పోలీసు బందోబస్తును నియమించుకోవాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ చంద్రశేఖరయ్య, సీఐ బి.వెంకటేశ్వర్లు, డీటీ రజనీకాంత్‌రెడ్డి, ఎలెక్షన్ డీటీ గుండాల నాయక్, సీనియర్ అసిస్టెంట్ బసన్నగౌడు, ఎస్‌ఐ ఓబులేశు ఉన్నారు.

ఈరోజు

బుసినే విరూపాక్షి ప్రచారం

దేవనకొండ: మండలంలోని బండపల్లి, చెల్లిలచెలిమల, బేతపల్లి, పి.కోటకొండ గ్రామాల్లో గురువారం వైఎస్సార్‌సీపీ ఆలూరు అసెంబ్లీ అభ్యర్థి విరూపాక్షి ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్లు పార్టీ మండల కన్వీనర్ తపాల శ్రీనివాసులు బుధవారం తెలిపారు.

కంగాటి శ్రీదేవి ప్రచారం

కృష్ణగిరి: వైఎస్సార్‌సీపీ పత్తికొండ అసెంబ్లీ అభ్యర్థి కంగాటి శ్రీదేవి గురువారం మండల పరిధిలోని అమకతాడులో ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్లు పార్టీ మండల కన్వీనర్ ఆర్బీ వెంకట్రాముడు తెలిపారు.

వెల్దుర్తి(కృష్ణగిరి): అల్లుగుండు గ్రామంలో ఉదయం 7 గంటలకు, సూదేపల్లె, బోగోలు, చెర్లకొత్తూరు, గోవర్ధనగిరి గ్రామాల్లో సాయంత్రం కంగాటి శ్రీదేవి ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు బొమ్మన రవిరెడ్డి తెలిపారు.

హొళగుందకు చేరిన నోట్ పుస్తకాలు

హొళగుంద: మండలానికి 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించిన నోట్ పుస్తకాలు బుధవారం హొళగుందకు చేరినట్లు ఎంఈఓ–2 జగన్నాథం తెలిపారు. 6–10 వ తరగతికి సంబంధించి 45,364 నోట్ పుస్తకాలు వచ్చాయన్నారు. త్వరలో పాఠ్య పుస్తకాలు, ఇతర సామగ్రి కూడా వస్తుందన్నారు.

పింఛన్‌దారుల అవస్థలు

కృష్ణగిరి/మద్దికెర/ఆస్పరి: సామాజిక పింఛన్‌దారులు మే నెల పింఛన్ మొదటి రోజు అందక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్రతినెలా ఒకటో తేదీనే వలంటీర్లు పింఛన్‌దారుల ఇంటివద్దకే వచ్చి పింఛన్ ఇచ్చేవారు. టీడీపీ నాయకుల ఫిర్యాదులతో ఈసీ ఆదేశాల మేరకు ప్రభుత్వం మే పింఛన్ లబ్ధిదారుల అకౌంట్లలో జమచేయనున్నట్లు, కాలు కదపలేని వారికి ఇళ్లవద్దనే అందించనున్నట్లు ప్రకటించింది. అయితే తమ ఇంటి వద్దకు అధికారులు వచ్చి ఇస్తారో, బ్యాంకులో వేస్తారో, బ్యాంకులో వేశారో లేదోనని పింఛన్‌దారులు ఆందోళన చెందారు. కొందరు సచివాలయాల వద్దకు వెళ్లి ఆరా తీశారు. మేడే కావడంతో బ్యాంకులకు సెలవు దినం కావడం, తమ అకౌంట్లలో జమ అయ్యిందో లేదోనని తెలుసుకునే వీలు లేకపోవడం, అకౌంట్లు సైతం సరిగా ఉన్నాయో లేదో తెలుసుకోవడం వారికి కష్టసాధ్యమైంది. సచివాలయ ఉద్యోగులు మాత్రం వాళ్లకు కేటాయించిన పింఛన్లను లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి ఇచ్చారు.

- ‘నా పింఛన్ దుడ్లు తెర్నేకల్లు ఏపీజీబీలో పడినాయంట. నాకు ఆరోగ్యం సరిగా లేదు. ఎవరూ చూసే వారు కూడా లేరు. ఆ పింఛన్ దుడ్లతోనే కడపు నింపుకుంటున్నా. అక్కడికి పోయి ఎట్లా తెచ్చుకోవాలో తెలియడం లేదు’ అని ఆస్పరి మండలం బనవనూరు గ్రామానికి చెందిన వృద్ధుడు షేక్‌బాషా నిట్టూర్చాడు.
- ‘మా లాంటి ముసలోళ్లు బ్యాంక్‌కు పోయి ఎట్లా తెచ్చుకుంటాం. వలంటీర్లను ఇళ్ల వద్దకు రాకుండా చేసిన చంద్రబాబుకు మా శాపం తగులుంది’ అంటూ మదికెర మండలం పెరవలి గ్రామానికి చెదిన లక్ష్మీదేవమ్మ ఆవేదన వెలిబుచ్చింది.
- ‘నా పింఛన్ దుడ్లు బ్యాంక్ ఖాతాలో వేశామని సచివాలయమోళ్లు అంటున్నారు. ఈ రోజు సెలవంట. రేపోమాపో పోయి తెచ్చుకోవాలి. అక్కడ ఎంత సేపు అవుతుందో’నని ఆస్పరి మండల కేంద్రానికి చెందిన వృద్ధురాలు యంకమ్మ పెదవి విరిచారు.

ఆదరించండి..అభివృద్ధి చేస్తా

వెల్దుర్తి(కృష్ణగిరి): ఎమ్మెల్యేగా ఆదరిస్తే నియోజకవర్గ అభివృద్ధి చేసి చూపుతానని, సమస్యల పరిష్కారంతో ప్రజలకు సౌకర్యాలు మెరుగుపరుస్తానని పత్తికొండ నియోజకవర్గ ఇండియా కూటమి అభ్యర్థి సీపీఐ రామచంద్రయ్య హామీ ఇచ్చారు. బుధవారం ఆయన వెల్దుర్తి మండల పరిధిలోని రామళ్లకోట, బోయనపల్లె, రత్నపల్లె, ఎల్ నగరం, గోవర్ధనగిరి, శ్రీరంగాపురం, బోగోలు, గుంటుపల్లె, సూదేపల్లె, అల్లుగుండు, బొమ్మిరెడ్డిపల్లె గ్రామాల్లో విస్తృత ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో సీపీఐ, అనుబంధ సంఘాల జిల్లా, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాలికపై లైంగిక దాడి

చిప్పగిరి: ఎనిమిదేళ్ల బాలికపై లైంగిక దాడి జరిగిన ఘటన మండలంలోని రామదుర్గం గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ మహమ్మద్ రిజ్వాన్ తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన బాలిక ఇంట్లో ఒక్కతే ఉండటం గమనించిన అదే గ్రామానికి చెందిన నాగరాజు లోపలికి చొరబడ్డాడు. నోట్లో గుడ్డలు కుక్కి లైంగిక దాడికి పాల్పడ్డాడు. పొలం నుంచి ఇంటికి వచ్చిన తల్లిదండ్రులకు బాలిక విషయం చెప్పడంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితునిపై పోక్సో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మేలు చేసిన వారిని మర్చిపోవద్దు

- వైఎస్సార్‌సీపీ పత్తికొండ అసెంబ్లీ అభ్యర్థి కంగాటి శ్రీదేవి



రాంపల్లిలో ప్రచార రథంపై నుంచి ప్రజలకు అభివాదం చేస్తున్న కంగాటి శ్రీదేవి



శభాష్‌పురంలో ఓటేయాలని కోరుతున్న శ్రీదేవి

తుగ్గలి: ఐదేళ్ల పాలనలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని గుర్తుంచుకొని ఓటు వేయాలని వైఎస్సార్‌సీపీ పత్తికొండ అసెంబ్లీ అభ్యర్థి కంగాటి శ్రీదేవి కోరారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి ప్రదీప్‌రెడ్డితో కలిసి ఆమె బుధవారం చెన్నంపల్లి, రామలింగాయపల్లి, శభాష్‌పురం, రాంపల్లి, పెండేకల్లు రైల్వే జంక్షన్, బొందిమడుగులలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. జగనన్న ప్రభుత్వంలో నవరత్నాల పథకాలతో అర్హులైన ప్రతిఒక్కరికీ లబ్ధి చేకూరిందన్నారు. నాడు–నేడుతో పాఠశాలలు, పేదలకు ఇళ్ల స్థలాలు, పక్కా ఇళ్ల నిర్మాణం, సీసీ రోడ్లు, సచివాలయాలు, ఆర్‌బీకేలు, హెల్త్ సెంటర్లు తదితర అభివృద్ధి పనులు చేపట్టినట్లు చెప్పారు. వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రభుత్వ సేవలను ఇళ్ల వద్దకు చేర్చిన ఘనత జగనన్నదే అన్నారు. కరోనా సమయంలో సంక్షేమ పథకాలు కొనసాగిచిన సంగతి కూడా మరిచిపోవద్దన్నారు. ఎన్నికల సమయంలో మాత్రమే వచ్చే టీడీపీ నాయకులు కావాలో.. కష్టాల్లో కూడా తోడుండే జగనన్న కావాలో ఆలోచించి ఓటేయాలని ఆమె ప్రజలను కోరారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మరోసారి ముఖ్యమంత్రిగా జగనన్నను గెలిపించుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా బీవై రామయ్యను గెలిపించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పుష్పావతి, రామాంజనమ్మ, లలితమ్మ, రంగనాథరెడ్డి, హనుమంతు, నాగభూషణరెడ్డి, సుధాకరరెడ్డి, చంద్రశేఖరరెడ్డి, మధు, రవి, రంజాన్, రాఘవరెడ్డి, రంగారెడ్డి, పులికొండ, జనార్ధనరెడ్డి, సుభాన్, పీరా, కోటేశ్వరరెడ్డి, వెంకటరాముడు, మనీంద్ర, హనుమంతరెడ్డి, ఈశ్వరరెడ్డి, సుంకన్న పాల్గొన్నారు.

ఫ్యాన్ గుర్తుకు ఓటేయండి



ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న జడ్పీటీసీ, నాయకులు

మద్దికెర: మండల కేంద్రంలోని చేనేత కాలనీ, మెయిన్ బజార్, కవిరెడ్డి వీధుల్లో జెడ్పీటీసీ మురళీధర్‌రెడ్డి, సర్పంచ్ సుహాసిని, వైఎస్సార్‌సీపీ నాయకులు కంగాటి శివారెడ్డి, తేజస్విణి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి ఐదేళ్లలో ప్రభుత్వం చేసిన మంచిని వివరించి ఫ్యాన్ గుర్తుకు ఓటేసి ఎమ్మెల్యేగా కంగాటి శ్రీదేవిని, ఎంపీగా బీవై రామయ్యను గెలిపించాలని కోరారు. ఎన్నికల మేనిఫెస్టో ప్రతులను ప్రజలకు పంపిణీ చేశారు.పార్టీ నాయ కులు వెంకటేశ్వర రెడ్డి, మల్లికార్జున, ఆంజనేయులు, రామకృష్ణ, తాలూరి వెంకటేశ్వరరెడ్డి, రామాంజులు, లింగరాజు, వెంకట్రామిరెడ్డి, కృష్ణ, చంద్ర పాల్గొన్నారు.

చంద్రబాబు హామీలు నమ్మొద్దు



గుండ్లమల్లాపురంలో ప్రచారం నిర్వహిస్తున్న దృశ్యం

కృష్ణగిరి: ఓట్ల కోసం మోసపూరిత హామీలతో వస్తున్న చంద్రబాబును నమ్మొద్దని, అదే ఓటుతో బుద్ధి చెప్పాలని ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకట్రామిరెడ్డి, జెడ్పీటీసీ కేఈ సుభాషిణి ప్రజలకు సూచించారు. మండల పరిధిలోని బి ఎర్రబావు, గుండ్లమల్లాపురం, పోతుగల్లు గ్రామాల్లో సర్పంచ్ తెలుగు వాణిశ్రీ, ఎంపీటీసీ బేతపల్లి రాజేశ్వరి, మండల కన్వీనర్ ఆర్బీ వెంకట్రాముడుతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ పథకాలను, మేనిఫెస్టోను వివరిస్తూ ఫ్యాన్ గుర్తుకు ఓటేసి మరోసారి ఎమ్మెల్యేగా శ్రీదేవిని, ఎంపీగా బీవై రామయ్యను గెలిపించాలని కోరారు. ప్రచారంలో నాయకులు నారాయణరెడ్డి, సుబ్బారెడ్డి, తెలుగు వెంకటేశ్, జులపాల మద్దిలేటి, బేతపల్లి సుధాకర్, వెంకట్రాముడు, సుంకన్న, రామకృష్ణ, నరసింహారెడ్డి, ఎర్రమల, వెంకటేశ్, బంబం బాషా, బ్రహ్మానందరెడ్డి, మాధవరావు, ప్రహ్లాద, జయరామిరెడ్డి, రంగనాయకులు పాల్గొన్నారు.

పార్టీ విజయానికి కృషి చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న రామ్మోహన్ రెడ్డి

వెల్దుర్తి(కృష్ణగిరి): పార్టీ విజయానికి కృషి చేయాలని వైఎస్సార్‌సీ నాయకుడు కంగాటి రామ్మోహన్ రెడ్డి నాయకులకు, కార్యకర్తలకు సూచించారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో మండల నాయకులు, కార్యకర్తలతో ఆయన సమావేశమయ్యారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో బూత్ స్థాయి నుంచి చేయాల్సిన ప్రచారం, అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించి ఓటు వేయాలని ప్రజలను కోరాలన్నారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు బొమ్మన రవిరెడ్డి, సచివాలయ కన్వీనర్ల మండల ఇన్‌చార్జ్ సమీర్‌కుమార్ రెడ్డి, జెడ్పీటీసీ సుంకన్న పాల్గొన్నారు.

నీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

మద్దికెర: వేసవిని దృష్టిలో పెట్టుకొని మండలంలోని గ్రామాల్లో నీటి సమస్య తలెత్తకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ అలివేలమ్మ అధికారులకు సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అనిత అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, సర్పంచులు, ప్రజాప్రతినిధులు నీటి సమస్య ఉన్న గ్రామాలను గుర్తించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు. మద్దికెరలో పంచాయతీ సిబ్బంది ఇష్టానుసారంగా కొళాయిలకు అక్రమ కనెక్షన్లు ఇస్తున్నారని సభ్యులు సభ దృష్టికి తెచ్చారు. స్పందించిన జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్‌రెడ్డి.. జల్‌జీవన్ మిషన్ కింద నిధులు మంజూరయ్యాయని, సాయినగర్, రాంనగర్‌లో పైపులైన్‌తో పాటు ఉచితంగా కొళాయి కనెక్షన్లు ఇచ్చామని వివరించారు. నీటి సమస్య పరిష్కారం కోసమే డిపాజిట్ లేకుండానే కనెక్షన్లు ఇచ్చామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు కల్పిచినా ఉత్తీర్ణత తగ్గడంపై విద్యాశాఖ అధికారులను ఎంపీపీ ప్రశ్నించారు. వీధి దీపాలు పగటిపూట వెలగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎం.అగ్రహారం గ్రామంలో మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించడం లేదని వైస్ ఎంపీపీ మహేశ్వరరెడ్డి, విద్యుత్ సిబ్బంది స్తంభాలను రోడ్డుకు అడ్డంగా పాతుతుండడంతో ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని మరో సభ్యుడు సభ్యుడు రామకృష్ణారెడ్డి సభ దృష్టికి తెచ్చారు. పరిశీలించి తొలగించేందుకు చర్యలు తీసుకుంటామని ఏఈ రఫీక్‌అహమ్మద్ తెలిపారు. సమావేశంలో ఈఓఆర్డీ మద్దిలేటి స్వామి, సర్పంచులు మల్లికార్జున, విజయుడు, సుహాసిని, ఆంజనేయులు, రాజగోపాల్‌రెడ్డి ఏఈలు ఉమాకాంత్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మయాంక్, వైద్యులు శ్రీలక్ష్మి, కృష్ణానాయక్ పాల్గొన్నారు.